# మూడు ముళ్ళ బంధం

''నాన్నా, ఈసారి అమ్మని నాతో తీసికెళ్లాలనుకుంటున్నాను కొన్నాళ్ళుండి వస్తుంది-'' అన్నాడు అమెరికా కొడుకు

''ఏం, నేను చచ్చాననా అమ్మని తీసికెళ్లడం' దురుసుగా అన్నాడు తండ్రి. కొడుకు నుదురు బట్టించి 'నాన్న -' హెచ్చరిస్తున్నట్టు కాస్త గట్టిగానే అన్నాడు.

''అమ్మకి కొన్నాళ్లు మార్పుకావాలను కుంటుంది, నాతో వస్తానంది. తీసికెడుతున్నాను కొన్నాళ్లుండి వస్తుంది-' మరో మాట అనే వీలు లేకుండా తన నిర్ణయం చెప్పాడు.

''కొన్నాళ్లేం ఖర్మ, శాశ్వతంగా వుంచుకో, నాకేం పరవాలేదు, నాగురించి ఎవరికి బెంగక్కరలేదు, నా సంగతి నేను చూసుకోగలను' ఉక్రోషం, అసహనం, ధ్వనించింది ఆగొంతులో - పక్కనించి వింటున్న రాజేశ్వరి ఏదో చెప్పడానికి నోరు తెరవ బోయింది, కొడుకు చాల్లే వూరుకో అని సౌంజ్ఞచేవాడు. 'అమ్మ మీకోసం వంటమనిషిన మాట్లాడింది. మీకేంకావాలో ఎలాచెయ్యాలో అన్ని చెప్పింది - మీకేం యిబ్బంది వుండదు - 'యింట్లోనే వుంటుంది ఆవిడ-' 'ఆయ్యోపాపం, నాగురించి అంత యావక్కరలేదు - నాసంగతి నేను చూసుకోగలను. ఎవరికెక్కడికి వెళ్లాలంటే వెళ్లి అక్కడుండచ్చు' మొహం ఎర్ర పరుచుకుని ఉక్రోషంగా అంటూ లేచివెళ్ళిపోయారు విశ్వనాథంగారు.

రాజేశ్వరి కలవరంగా కొడుకు మొహం వైపుచూసింది. ' వూరుకో అమ్మ, నీవేం పట్టించుకోకు అయన మాటలు, ఆయన సంగతి మనకి తెలియదా - నీవు మాట్లాడక వూరుకో, నేను చూసుకుంటాను -' అని అభయం యిచ్చాడు నరేష్.

నిన్న సాయంత్రం తండ్రి వాక్‌కి వెళ్లినపుడు తల్లి వచ్చి ఏదో చెప్పాలనుకుంటూ సందిగ్ధ పడడం చూసి' ఏమిటమ్మా అన్నాడు నరేష్ – 'నానీ,.. ఈసారి నన్ను నీతో తీసుకెడతావా, కొన్నాళ్ళుండి రావాలని ఉంది నీదగ్గిర' అంది. నరేష్ ఆశ్చర్యంగా చూశాడు – తల్లి తనంతటతను తనతోవస్తాననడం ఆశ్చర్యంతో పాటు ఆనందంకల్గించింది – గత పదేళ్లుగా ఎన్నిసార్లు పిల్చినా అక్కడ మాకు తోచదురాబాబూ, ఆచలి అది పడదు ఏదో ఓసారి వచ్చాం. నాలుగువూర్లూతిరిగాం, నీ యిల్లు వాకిలి సంసారం చూశాం గదా, అప్రయాణం అది యింక చేసే ఓపిక లేదురా, నేనెలావున్న మీనాన్న అసలు రారురాయింక – కిందటిసారే చూశావుగా వున్న నాలుగు నెలలు ఎంత సణిగారో..' అని రావడానికిష్టపడని తల్లి తనంతట తను అడిగిందంటే–?! ఏంటమ్మా నిజంగానే అంటున్నావా, నాన్నవస్తానన్నారా – ' అనుమానంగా అడిగాడు.

'మీ నాన్న కాదురా, నే ఒక్కర్తిని రావాలను కుంటున్నాను... అని కాస్త ఆగి తలదించుకుని' నాకిక్కడ నించి రెండు మూడు నెలలు దూరంగా వెళ్ళిపోయి ప్రశాంతంగా బతకాలని పిస్తుందిరా. యీయనతో పడలేక పోతునా్రా.. ఆవిడ గొంతురుద్ధమయి, కళ్లుతడి ఆయ్యాయి –'వయసుతోపాటు కాల్చుకు తినడం మరీ ఎక్కువైపోయింది నానీ, అనని మాట అనే మాట లేదు, నోటికెంత వస్తే అంత అందరి ముందు అనడం, ప్రతి దానికి విసుగు, కసుర్లు, ఊ అంటే కోపం ఆ అంటే తిట్లు పడలేక పోతునా్రా. యీ కొంప లోవుండలేక పొతున్నానురా–' కళ్ళు తుడుచుకుంటూ అంది రాజేశ్వరమ్మ – తండ్రి సంగతి తెల్సిన కొడుకు తల్లిని ఏమనిచెప్పి ఓదార్చాలో తెలియలేదు. 'నాకుడెబ్బైఏళ్లువస్తున్నాయి – నేను మనిషినని, నాకు అవమానం, అభిమానం వుంటుందని ఆయన ఏప్పటికీ గ్రహించరు. కట్టుకున్న దానిమీద ఆభిమానం, గౌరవం అనేది ఆయనలో ఏకోశానా కనపడదు. భార్య అంటే చాకిరి చేస్తూ తన కాలికింద పడుండి, ఏమన్నా పడుండాలనే ఆమనస్తత్వం నే చచ్చినా మారదు. ఆయనకి యీవయస్సులో వేళవేళలకి అన్ని అమర్చి పైడ్తూ చాకిరి చేస్తున్నానన్న కృతజ్ఞతన్నా లేదు మనిషికి – అయనకి వచ్చినట్టే నాకు వయసు పైబడ్తోందన్న అలోచన అయనకి లేదు. ఏ కాస్త చిన్న తప్పు జరిగినా విరుచుకు పడి నానా మాటలు అనడం – వూరుకొంటే మొద్దులా జవాబివ్వవేం అని తిట్లు, జవాబిస్తే ఏం నోరు లేస్తుంది అని ఎగరడం. ఏం బతుకునా నాయనా యిది – ఆయనకి నే లేని లోటు , నా విలువ తెలియాలంటే ఆయన్ని విడిచి కొన్నాళ్ళు దూరంగా వుండాలని నిర్ణయించు కున్నాను–' తల్లి ఆవేదన అర్థం చేసుకున్నాడు నరేష్ – 'అమ్మా, నీకు చాలా సార్లు ఇది వరకే

చెప్పను, మరీ అంతలా పడివుండద్దు, ఏదన్నా అన్నప్పుడు జవాబిస్తూ వుండ మని, నీవలా వూరుకోబట్టే ఆయన నిన్నులోకువ కట్టారు - మాటకి మాట అంటే, అనే ముందు కాస్త జంకుతారని చెప్పాను నీకు. నీ వయసుకేనా గౌరవం యివ్వకుండా అలా అనడం, నీవు సహించడంవల్లే - ' భాధగా, కోపంగా అన్నాడు - ''నోరు మూసుకుంటాంటేనే యిలా అనే మనిషి జవాబిస్తే సహిస్తా(రా- ఎందుకీ గోల, రొస్టు అని నాపని నేను చేసుకొని వుంటున్నా - యీవయస్సులో గొడవ లేమిటి నలుగురు నవ్వుతారని సహిస్తున్నకొద్ది... నా సహనానికీ హద్దుందని ఆయనకి తెలియాలి, నన్ను కొన్నాళ్ళు తీసికెడతావా... నీకు వీలుంటుందా, నీకు యిబ్బందేం వుండదుగదా - ' బిడియపడ్తు అడిగింది రాజేశ్వరమ్మ.

నరేష్ కోపంగా చూశాడు- 'ఏమిటమ్మా ఆ మాటలు - ఎన్నిసార్లు పిలిచాను రమ్మని, నాన్నకిబ్బంది అని, ఆయన్ని వంటరిగా వదిలి వస్తే బాగుండదని అనే దానివి. అమ్మా, నీకు ఎన్నాళ్లుండాలనిపిస్తే అన్నాళ్లుండు నాదగ్గిర నీకేలోటు రాకుండా చూసే పూచినాది.

''అయితే నీవే మీ నాన్నతో ఓ మాట చెప్పి టిక్కట్టు అది ఏర్పాటు చెయ్యి-' అంది.

కొడుకు ఆమాట చెప్పిందగ్గిర నించి విశ్వనాథం గారు మరింత బిగుసుకు పోయారు. భార్యతో అసలు మాటలు మానేసారు. మొహం ధుమ ధుమ లాడించుకుని విసరుగా వెళ్ళిపోవడం, ఏం కవల్సినా అడగకుండా తనే చేసుకోడం, కొడుకు తో కూడా చాలా ముభావంగా అడిగిందానికి ఊ ఆ - అనడంకంటె ఎక్కవ మాట్లాడకుండ యింట్లో సత్యా(గహం చేస్తూ తన అసమ్మతి, అ(పసన్నత తెలియచేశారు - రాజేశ్వరి చూసి చూడనట్టు (పవర్తించసాగింది - కొడుకు పట్టించుకోలేదు.

వీసా, టిక్కట్టు వచ్చాయి-' నాన్నా, రేపు సాయం(త బయలుదేరుతన్నాను, అమ్మకీ టిక్కట్ట తీసాను-' కొడుకు చెప్పాడు - తన కోపాన్ని, అయిష్టతని చూసీ (గహించీ వెళ్ళడానికే భార్యతయారయిందిన మొహం మరింత గంటు పెట్టుకున్నాడు-' మంచిది' అన్నారు విశ్వనాధం వ్యంగ్యంగా ''వంటావిడ వచ్చారు. అన్ని మన పద్ధతులు, మీ భోజన వేళలు అన్ని చెప్పింది. మీ కెలా కావలిస్తే అలా చేస్తుంది చెపితే - పని మనిషి వుండనేవఉంది మీకేం యిబ్బందుండదు...'' కొడుకు మాటపూర్తికాకుండానే 'నాకేం యిబ్బంది-ఎవరన్నారు యిబ్బందని, యీవిడ లేకపోతే గడవదనుకుంటుంది, కోడిపెట్ట ముసలమ్మ కథమాదిరి, వెళ్ళి శాశ్వతంగా

అక్కడే వుండచ్చు నేను చచ్చాననుకుని-' ఆఖరి అస్త్రం వదిలారు-అంత మాట అన్నాక భార్య ఆగిపోతుందన్న ఆయన మనస్సులో ఆశ, - మర్నాడు భార్య సామానులన్నీ సర్దుకుంటూ, పచ్చళ్లు, పొడులు, చేస్తూ బజారునించి మిఠాయిలు అన్నీ తెప్పించడంచూసాక చిన్న పిల్లాడిలా ఉక్రోషపడిపోయారు. దీనికెంత ధైర్యం! తను లేకుండ, తనని వంటరిగా యీవయస్సులో వదిలి వెళ్ళడమా.. ఎంత పొగరు. కొడుకుని చూసి తైతక్కలాడుతుంది. వెళ్లనీ.. వెళ్లనీ దీని పని చెపుతా, ఇల్లు ఆస్థి, గీస్తి ఏం రాయకుండా బుర్ర గొరిగించి కుర్చోపెడతాను అపుడుతెలుస్తుంది - ఏ కొడుకి ఎన్నాళ్లు ఆదు కుంటాడో చూద్దాం. - మనసు కల్లు తాగిన కోతిలా గెంతులు వేసింది.

★ ★ ★ ★ ★

'బాబుగారు, టిఫిను పెట్టాను-' వంటావిడ సీతమ్మ వినయంగా అంది - మీరు పిలవక్కరలేదు, టైమయితే నేనేవస్తా.' చదువుతున్న పేపరు వంచి తలెత్తి ముఖం చిట్లించి అన్నారాయన - వంటావిడ ముఖంచిన్న పుచ్చుకుని లోపలికెళ్లిపోయింది. రాజేశ్వరి వెళ్లి పట్టుమని యిరవైనాల్గుగంటలు గడవలేదుకానీ ఇంట్లో ఏదో వెలితి, శూన్యం - ఆశూన్యం అయన మనస్సులో ఏర్పడింది. ఏదో చాలా నిబ్బరంగా, గంభీరంగా పైకి వున్నా నిన్నటినించి ఆయన మనసు మన స్సులో లేదు - రాజేశ్వరి వెళుతూ వెళుతూ లాంచనంగా ఏదో చెప్పాలని చెప్పినట్టు' వెళ్తున్నాను - జాగ్రత్త' అని మాత్రం అంది. ఆయన ముఖం పక్కకి తిప్పుకున్నాడు - కనీసం గేటు వరకయినా సాగనంపడానికి వెళ్లకుండా వీధి వసరాలో పడక కుర్చీకంటుకుపోయి కూర్చున్నారు.'' నాన్న ఫోను చేస్తుంటాను, జాగ్రత్త' అన్నాడు కొడుకు. దానికీ జవాబులేదు - ఆవిడ వెళ్లాక వంటరిగా తల్లివదిలి వెళ్ళిపోతే చిన్నపిల్లాడు ఉక్రోష పడినట్టు రాత్రంతా మనస్సులో మధనపడ్డారాయన -

'ఏమిటివి యిడ్డెన్లా, యిటకరాళ్ళా - యింత గట్టిగావున్నయేమిటి' సీతమ్మగతుక్కుమని 'అమ్మగారు చెప్పిన విధంగానే చేశానండి' వినయంగాఅంది - 'ఆవిడ చేసినట్టు చేస్తే మెత్తగా దూదుల్లా వుండాలి, రాళ్లలావున్నాయి- రేపయినా సరిగా చేయండి - 'టిఫినుప్లేటు ముందునించి లేచి వెళ్లిపోయారు విశ్వనాథం - 'వరాలూ.. ఏమొచ్చాయో ఈ యిడ్డెన్లకి - మెత్తగా లేవు-' పనిమనిషి చేతిలో ఓ యిడ్డెనుపెట్టి చూడ మంటూ అంది సీతమ్మ -' బానే వున్నాయమ్మా- ఏటో అయ్యగారికి కళకళలు లెండి. అయ్యో టిఫిను తినలేదా

ఆయన' ఏమో బావులేవేమో. నాకు వంటలు తప్ప టిఫిన్లు చేయడం అలవాటు లేదు అంచేత సరిగా రాలేదేమో – 'పెళ్లిళ్లు, శుభకార్యల పెద్దవంటలు అలవాటు తప్ప యిళ్లల్లో అలవాటులేని ఆవిడకి నిజానికి టిఫిన్లు చేయడం రాదు–' అమ్మ గారు చెప్పినట్టే రుబ్బి నూక కలిపాను మరి' స్వగతంలా అనుకుంది. 'ఏమిటండీ యిది పులుసేనా, యింత చిక్కగా గంజిలావుంది – బెల్లం పడనేలేదు..చారే మిటి యింత పుల్లగా పులుసులావుంది. యీ కూర నీళ్ళోడుతుంది – వంట రాదా మీకు – యిది వరకెక్కడ చేయలేదా – వంట యిలా తగలేశారు – పొద్దుట టిఫినలా చేశారు–' మొహంచిట్లించి దురుసుగా అన్నాడాయాన – సీతమ్మ తెల్లపోయింది. వంట రాదా అంటుంటే ఆవిడకేం జవాబివ్వాలో తెలియలేదు – ముఫైఐదేళ్ళుగా యించుమించ రోజూ చేసేవంట చక్కగా గుమ్మడి కాయముక్కలు ములక్కాడలు, దుంపలు వేసి పులుసుపెడితే అలా అంటారేమిటి – గుమ్మడి కాయపులుసు సీతమ్మగారే పెట్టాలంటారు తిన్నవాళ్లు– పెద్దవంటలు అలవాటయి కాస్త కాస్త వండడం వల్ల పడాల్సినవి సరిగా పడలేదా ఏమిటి చెప్మా – మధనపడింది. తీరా భోజనానికి కూర్చుని రుచులు చూస్తే అన్నీ సరిగానే వున్నాయని పించి యింకెవరితో చెప్పుకోవాలో తెలియక పనిమనిషితో చెప్పుకుంది. అమ్మగారు వెళ్ళిన కోపం మీ మీద చూపిస్తున్నాడయ్యా – ' వరాలు నవ్వి అది. గత పదేళ్లుగా పనిచేస్తున్నవరాలుకి యింట్లో అయ్యగారి సంగతి బాగానే తెలుసు. 'అమ్మగారు వంటరిగా వదిలి వెళ్లిపోనారని అయ్యికి భాధ. యీరోజువంట సరిగా నేదని కాదు. అమ్మ ఎంత బాగా వండినా ఏదో వంకలు పెట్టుడం. అయనకి అలవాటు' తేలిగ్గా తేల్చేసింది – 'అంతే నంటావా, అమ్మబాబోయ్ – యిలా అయితే – యిలా వంకలు పెడితే ఎలా చేస్తా' అంది సీతమ్మ.

'వరాలూ – లోపల్నించికేక. 'ఏటయ్యగారు–' ఏమిటి ఆరిన బట్టలన్నీ కుప్పలా పడేశావు మంచంమీద. మడత పెట్టాలని తెలీదా. మడత పెట్టి స్టాండు మీద పెట్టు – ' ఆర్డరు వేశారు – 'నేనెప్పుడూ పెట్టలా, అమ్మగారు మడతెట్టుకునేవారు' 'అంటే మీ అమ్మగారు లేకపోతే బట్టలలా పడేస్తే నే మడతలు పెట్టుకోవాలా హుంకరిచారు – వారాలుకి అమ్మగారు మడత పెట్టమని చెప్పలేదు – ఆవిడ హడావిడిలో మర్చిపోయిందేమో – నెమ్మదిగా కింద కూర్చుని మడతలు పెట్టింది. 'ఏమిటే లాల్చీ అలా మడతపెడ్తున్నావు – మళ్లీ తొడుక్కోవాలా వద్దా – అలా అడ్డంగా ఏమిటి నిలువు మడతపెట్టు – వరాలు అయోమయంగా చూసింది. 'పో అవతలికి బట్టలు మడతపెట్టడం చాతకాదు – ఆడదానివి గాదు!'' వరాలుని పొమ్మని నాలుగు బట్టలు ఆరగంట కూర్చుని విప్పి మడిచి మడతలు

పెట్టుకున్నారాయన. పెళ్లికి ముందు తల్లి. పెళ్లాయ్యక భార్య చాకిరి చేయడం అలవాటయిన ఆయన మంచి నీళ్లు కూడా బిందెవంచి ముంచుకు ఏనాడు తాగలేదు. తాగిన గ్లాసు అలాకింద పెట్టడం తప్ప ఏనాడు తీయలేదు - బట్టలురెడీగా, పక్కరెడిగా, భోజనం, టిఫిను ప్రతిది వేళవేళకి అమర్చి పెట్టే భార్య - మొగుడంటే చేయించుకునే తప్ప చేసే జాతి కాదని అని ఆయన విశ్వాసం - అది ఆయింట్లో ఆయన కొచ్చిన సంస్కారం. తల్లి ఏనాడు వంటింటి గడపదాటని మహాయిల్లాలుగా బతికింది. ఆవిడ ఆయనకి ఆదర్శం! దానికి తోడు తండ్రి పెళ్లికాంగానే చేసిన నీతి భోధ - ' ఒరేయ్ నానీ, ఈ ఆడవాళ్ళున్నారు చూశావూ - వెంట్రుక వాసంత దారి యిచ్చావో ఆవెంట్రుక పట్టుకునే తలమీదకెక్కి నిన్ను ఆడిద్దామనుకుంటారు - అలాంటి పొరపాటు చేయకుసుమా, ఎక్కడుంచాల్సిన వాళ్ళని అక్కడవుంచితేనే మనకి లొంగుతారు -' అన్నాడాయన కోడలు కాపురానికి వచ్చిన మూడో రోజు కొత్తపెళ్ళాం నూతిలోంచి నీళ్ళుతోడుతుంటే ఆమె చేతిలో బాల్చి తీసుకుని నీళ్లు తోడి గాబు నింపిన కొడుకుని చూసి ''పాపం కొత్త మోజు, పిచ్చి సన్నాసిని యిలా వదిలేస్తే రేపట్నించి నీళ్లే తోడిస్తుందో - వాకిళ్లే తుడిపిస్తుందో. ఆడంగి వెధవలా వీడా పనులుచేసి వంశ గౌరవం మంట గలిస్తాడేమో,' ననిపించి కొడుక్కి హితభోధ చేశాడు - ఆ మాటలు, విశ్వనాథం గారి బుర్రలో బాగానే దూరాయి. తండ్రి అనుభవంతో చెప్పిన మాటలు ఆయన మీద బాగానే పనిచేశాయి. తండ్రితల్లి మీద అధికారం చెలాయిస్తూ చేయించుకునే పనులు చూసి మొగుడంటే అలాగే వుండాలి అన్న నమ్మకం కలిగించింది. దానికి తోడు రాజేశ్వరి కాస్త చదువుకున్న ఆవిడ పుస్తకాలు, పత్రికలు చదువుతుండేది. మెట్రిక్ వరకే చదివినా, ఆవిడ కాన్వెంటు చదువుతో ఇంగ్లీషు బాగానే మాట్లాడేది పేపరు చదివి రాజకీయాలు చర్చించేది. ఇంట్లో తల్లిలా వంటింట్లోనే రోజంత పడివుండకుండా పనిచేసుకుని గదిలో కూర్చుని పుస్తకాలు చదివేది. నాజుగ్గా చీరకట్టి, వళ్లు, యిల్లు పొందికగా సర్దడం - ఆవిడ ప్రతి పనిలో, చేతలో, మాటలో ఆధునికత కనిపించేది - తనతో మాట్లాడి నప్పుడు తల్లిలా భర్త అంటే భయపడకుండ తన మనసులో భావాలు స్వేచ్ఛగా చనువుగా వ్యక్తీకరించడం, తనకి నచ్చినిది వాదన చేసి తప్పొప్పులు చర్చించి వప్పించాలని ప్రయత్నించే ధోరణి అది చూసి యీమెకి కాస్త అలుసిస్తే తర్వాత తనని లెక్క చెయ్యదు తండ్రి చెప్పింది నిజం, మొక్కగానే వంచాలని నిర్ణయంతీసుకుని రాజేశ్వరిని అదుపాజ్ఞలో వుంచడం ఆరంభించారు విశ్వనాథం - ఆవిడ చెప్పిన దానికి వప్పుకోకుండా తనన్నదే రైటనడం, యింట్లో మగాడిదే పెత్తనం, ఆడది వంటింటి వరకే మరిమితం అన్న

విషయాలు ఆవిడకి వంట బట్టించేందుకు కాస్త యిబ్బందే అయింది - అయిన దానికి కాని దానికి కయ్యానికి కాలు దువ్వినట్టు ఎందుకు మాట్లాడి , అలా కసిరి ఆధారిటి చేసి చెప్పడం ఎందుకు సౌమ్యంగా చెప్పరాదా అని బాధపడేది. ఆమాటే అంటే నోరు మూసుకో నీ అతి తెలివి చూపించకు అని అనవసరంగా కోప్పడే భర్త తత్వం అర్థం కాలేదావిడికి - వాదిస్తే మరింత కోపం తెచ్చుకుని రోజుల తరబడి మాట్లాడక పోవడం, చిన్నపొరపాటు జరిగినా అందరి ముందు అవమానపరచడం - కొన్నాళ్లలా జరిగినా భర్తని మార్చుకోలేక, అందరిలో చిన్నపోవడం యిష్టంలేక ఆమె ముభావంగా తనపని తను చూసుకునేది - ఉద్యోగం వచ్చివేరింటి కాపురం వచ్చినా భర్తలో మార్పులేక పోవడంతో అతని మనస్తత్వం అంతే అని సరిపెట్టుకుని బతకడం నేర్చుకుంది - భార్యగా తన కర్తవ్యం నిర్వర్తించడం తప్ప వారిద్దరి మధ్య సయోధ్యత, సామరస్యం అనురాగం లోపించాయి ఆకాపురంలో - పిల్లలు పుట్టారు - పెరిగారు - చదువులు పెళ్లిళ్లు అయివెళ్లి వాళ్లయిద్దరూ ఒంటరిగా మిగిలినా మనస్సులో మాట స్వేచ్ఛగా ఏనాడు చెప్పుకోలేక ఒంటరితనము అనుభవించింది - తన పని, తనపుస్తకాలు, తనపూజ, మొక్కలు అలవాటు చేసుకుంది ఆవిడ. ఈ విధంగా విశ్వనాధం గారు భార్యని తన చెప్పు చేతల్లో వుంచుకుని సాధించాను అనుకున్నారు తప్ప కాపురంలో తనుకోల్పోయిందేమిటో అయన గ్రహించుకోలేదు - వయసు మీద పడి, ఉద్యోగం లో రిటైరయి యింట్లో కూర్చోడం ఆరంభించాక ఆయన చిరాకులు, సాధింపులు, కసుర్లు మరింత ఎక్కువై రాజేశ్వరికి భరించ లేనంత నైరాశ్యం ఓరకమైన విరక్తి, భర్తంటే ద్వేషం మరింత పెరిగి ఆపరిసరాలనించి, ఆవాతావరణం నించి కొన్నాళ్ళు దూరంగా వెళ్లి ప్రశాంతంగా తను జీవించాలి. భర్తకు తనంటే ఏమిటో, తను లేని లోటు ఎలా వుంటుందో తెలియ చేయాలన్న పంతం వచ్చింది - అడుగడుగునా అన్ని అమరుస్తుంటే ఆయనకి తెలీడం లేదు - దూరం వెడితే విలువ తెలుసొస్తుంది అని కొడుకుతో ప్రయాణం పెట్టుకుంది.

* * * * *

''వరాలూ, అమ్మబాబోయ్, యియనకి వండిపెట్టడం నావల్ల గాదే తల్లి. ఏం చేసినా ఎలా చేసినా వంక పెట్టకుండా తినడాయన, ప్రతిదానికి బుర్రు బుర్రు కసురు కుంటూ మాట్లాడతారేమిటి - ఏదో ఓనెలరెండు నెలలపాటు, విశ్రాంతిగా - ఒక్క మనిషిగదా కాస్త ఉడకేసి పడేసి హాయిగా వుందామనుకున్నాను గాని యిదేం మనిషి బాబూ, ఏమిటలా కసురు కుంటాడు ప్రతిదానికి, పెళ్లాం అనుకుంటాడా - 'పెరట్లో అంట్లు తోముతున్న వరాలు దగ్గిర మొర పెట్టుకుంది సీతమ్మగారు - రాజేశ్వరి వెళ్ళి పట్టుమని పదిరోజులు కాలేదు కాని, పది రోజులలోనే అయన

తత్వం అర్థం అయి, ఆయన మాటతీరు ప్రవర్తన నచ్చక చిన్న పుచ్చుకుంది ఆవిడ – '' నావంటకి వంకలు పెడ్తాడేమిటి ఎన్ని శుభకార్యలకి, పెళ్ళిళ్ళకి వండిన దాన్ని – రోజుకి రెండొందలు సంపాదించుకుంటాను, యీయనేమనుకుంటున్నారో నాగురించి ఏదంటే అదిపడి, వుంటాననుకుంటున్నారేమో–' ఉక్రోషంగా అంది.

'అయ్య అంతే నమ్మ – పాపం అమ్మగారు నోరుముసుకి పడివుంటుంది గనక యీయన గారి ఆటలు సాగుతాయి – కాస్త నోరున్న ఆడదయితే యింట్లో ప్రతి రోజా అగ్గిరాజేయకుండా అగ్గిరాజుకునేది. అమ్మవెళ్లాక అయ్యకి తెలుసోస్తంది అమ్మవంటబాగుందని, అమ్మ టిఫిను బాగుందని, అమ్మ వుంటే ఇల్లు శుభ్రంగా వుండేదని.. నన్నూ సతాయిస్తున్నాడు గదా యీ కుర్చీలాగావు, ఆవుూల తుడవలేదు, బట్టలుతీసి బాగానేదు అంటూ సాధించుకున్నాడుగా –'' ఆ పాపం ఆవిడ ఓ రెండు నెలలు ఆయన్ని కనిపెట్టుకుని వండి పెట్టాలి అంటూ ఎక్కువ జీతం యిస్తానంటే కాదనలేక వచ్చాను – యిలా సాధిస్తే పోతా నేనుగతిలేక పడాల్సిన ఖర్మనాకేం 'లేదు' కోపంగా అంది సీతమ్మ.

★ ★ ★ ★ ★

అమెరికాలో కొడుకింటికి వచ్చాక నిజంగా రాజేశ్వరికి శారీరకంగా మానసికంగా మంచి విశ్రాంతి దొరకినట్టుచాలా హాయిగా ఆనందంగా వుంది. మనవళ్ళతో మాట్లాడుతో, వాళ్ళతో గేమ్స్ ఆడుతూ, కథలు చెపుతూ ఏ బరువు భాధ్యతలు లేకుండా నిశ్చింతగా వుండడం ఎంతో నచ్చింది. కొడుకు కాపురం చూస్తుంటే భార్యభర్తలంటే యిలా వుండాలి, యిదీ అన్యోనత, ఇదీ సంసారం అంటే అన్పించింది. యిద్దరూ ఉద్యోగస్తులు. యిద్దరు చేరోపనిచకచక చేసుకుంటారు. కొడుకు పిల్లల బట్టలు యిస్త్రీ చేసి వాళ్ల బూట్లుతుడిచి పిల్లల్ని రెడీచేస్తాడు పక్కలు దులిపి వేసేస్తాడు పొద్దుటే – కోడలు ఫలహారం, వంటపని చూస్తుంటే మిగతా పనులు అతను చూసుకుంటాడు – ఏచిన్న పొరపాటు చేసినా భార్యకి 'సారీ – వెరీ సారీ అంటూంటాడు – థ్యాంక్సులు సరేసరి – కోడలు వినోదినీ అంతే ఏదన్నా మర్చి పోతే 'అయ్యో సారీ అంటుంది. 'ఫర్‌గెట్ యిట్ ఒకే' అంటాడు తేలిగ్గా కొడుకు – చేయలేదే – మర్చిపోయావు – నామాట లెక్కలేదు అంటూ దెప్పుళ్ళు సాధింపులు వారిమధ్యలేవు. డిన్నరు టేబులుదగ్గర నలుగురూ సరదాగా ఆఫీసు కబుర్లు, స్కూలు కబుర్లు, స్నేహితుల గురించి చెప్పకుంటారు – పిల్లల్ని కసరడం, తిట్టడం, కోపడడం లాంటివి లేవు – ప్రేమగా నచ్చచెప్తారు – అలా అని తండ్రి తల్లి అంటే వాళ్ళకి ఎంత భక్తి, భయం – 'ఆ' అంటే అగుతారు. వంటలో

లోటు పాట్లు వచ్చినా కొడుకు ఎంత సున్నితంగా హాస్యంగా ఎత్తిచూపుతాడు- 'అయ్యో' అంటుంది ఆ అమ్మాయి నవ్వుతూ. ఒక్కపూట వంటలో ఉప్పో, కారమో ఎక్కువైతే కావాలని చేసినట్టు, నేరం చేసినట్టు దుయ్యపట్టే భర్తతో పోల్చుకోకుండా వుండలేకపోయేది. ఏభైఏళ్లసంసారం ఎప్పుడైనా యిలాంటి చక్కని అనుభూతులు మిగిల్చిందా - యిలా ఆప్యాయంగా దగ్గిర కుర్చుని కబుర్లాడుకున్నారా తము - ఒకరి అనుభవాలు ఒకరు చెప్పుకున్నారా! ఒకరి భావాలు ఒకరు పంచుకున్నారా - ఒకరి యిష్టాలొకరు తెల్సుకున్నారా - ఎంతసేపు వన్‌వే ట్రాఫిక్ లాగ ఆయన మాట, ఆయన పంతం, ఆయనిష్టాయిష్టాలు తప్ప భార్యగా ఆయింట్లో సర్దుకు బతకడం తప్ప యిలాంటి యిచ్చిపుచ్చుకునే ఆనందం తన సంసారంలో ఏరోజు దొరకలేదు - అన్యోనత, అనురాగం అన్నపదాలకి అర్థాలే తెలీకుండా ఏభైఏళ్లు సంసారం చేసింది - అన్నింటికి మాదిరి దీనికి పెట్టిపుట్టాలేమో! అన్నింటిని మించిన సంపద భార్యభర్తలమధ్య ఆన్యోన్యత అన్నది వీళ్ల సంసారం చూశాకే తెలుస్తోంది. పోనీ కోడలు అదృష్టవంతురాలు - కొడుక్కి తండ్రి వారసత్వం అబ్బలేదు - నయమే అనుకుంది.

వచ్చి యిరవై రోజులు దాటాక 'మీ నాన్న ఎలావున్నారో, నేలేని లోటు కాస్తయినా తెల్సిందో లేదో-' అంది భోజనాల టేబిలు దగ్గర -

'ఎలా వుండడానికి ఏముంది - వారం వారం ఫోను చేస్తున్నాగా, బాగానే వున్నరు'

'ఆ బాగుండడం సరేలే -' నవ్వింది రాజేశ్వరి.

'అమ్మా, కొన్నాళ్లు నాన్నసంగతి మర్చిపో, కనీసం యిక్కడున్నన్ని రోజులు అయిన హాయిగా వుండు-' అన్నాడు నరేష్

'బాగుంది ఎలా మర్చిపోతారు - ఏభై ఏళ్ల అనుబంధం - చెప్పినంత సుళువుగాదు అంది కోడలు వినోదిని.

'పోనీ నీకంత అనిపిస్తే ఫోనుచేసి మాట్లాడు' అన్నాడు తేలిగ్గా.

''వద్దు - వద్దు - వూరికే అన్నా- అసలు ఆయన ఎలా ఫీలవుతున్నారో - మనసులోనైనా మిస్సవుతున్నరో లేదో అన్న ఆలోచనతో అలా అన్నా అంతే -'' నవ్వుతో అంది రాజేశ్వరి.

'మన యిండియన్స్ ఈ సెంటిమెంట్లు, యీ బలహీనతలే పెళ్లిళ్ళని నిలబెడ్తున్నాయనుకుంటాను, ఓ విధంగా చూస్తే మైనస్ పాయింటు, మరోవిధంగా

ప్లస్‌పాయింటు. 'నిజమే – మన పెళ్లిలో వుండే పవిత్రతో, సెంటిమెంటో గాని కొట్టుకున్న, తిట్టుకున్నా భర్యభర్తల బంధం వీడిపోకుండా వుండడం అన్నింటి కన్నా గొప్పదనుకుంటా –' అంది వినోదిని. ఏమిటోరా యిదీ పెట్టిపుట్టడం అంటారే... చేసుకన్న వాడికి చేసుకున్నంత అన్నట్లు భార్యభర్తల అన్యోన్యత అన్నదీ ఓ అదృష్టమే – దానికి నేను నోచుకోలేదనుకోవాలి –

'అమ్మా – అసలు నీవు నాన్నని మార్చడనికెప్పుడూ ప్రయత్నించలేదా – ఆయన ప్రవర్తననీకు నచ్చలేదు, మార్చుకోమని సూచించలేదా – '' ఏదో సామెత చెప్పినట్టు రామాయణం అంతావిని రాముడికి సీతేమవుతుందని అడిగుతున్నావు గత ఏభై ఏళ్లకి పైగా మీనాన్నని చూస్తూ – ఆయన యితర్లని మాటమాట్లాడనిచ్చారా – ఎవరు చెప్పడానికి అవకాశం యిచ్చారా. నాయనా ఓ అరవై ఏళ్లక్రితం ఆర్థికస్వాతంత్రం లేని భార్య భర్తకి ఎదురుతిరిగి నీ పద్ధతి మార్చుకో అని చెప్పే అవకాశం వుందంటావా – చెప్పినా ఆ భర్త సామరస్యంగా ఆవిషయం తీసుకుని తన్ని తాను మార్చుకునే ప్రయత్నం చేసే సామ్యత ఆనాటి మగవాళ్లల్లో వుండేదా – ఇంటి యజమానిగా, భర్తగా, భార్యల మనో భావాలకి గౌరవం యిచ్చే ప్రసక్తి ఎక్కడ వుండేదిరా – అది నిజమే నరేష్ – అసలు మనదేశంలో భర్యభర్తల మధ్య అభిప్రాయబేధాలకి సగం కారణం కమ్యూనికేషన్ గ్యాప్ అంటాను–' వినోదిని అంది. 'నిజమేనమ్మా, ఈ నాటి ఆడపిల్లల్లా నచ్చనిది మొకం మీద చెప్పే ఆవకాశం మాకానాడు లేదు – భార్య చెప్పడం భర్త వినడమా అన్న ఇగో ప్రతి మగవాడికి వుండేది అందరూ కాదులే అమ్మా . అంత నాన్నలా వుంటారా – అది ఆయన స్వభావం అనుకుంటాను – మా స్నేహితుల యిళ్లలో నాన్నలు కొందరు బాగానే వుండేవారే –'' నీవన్నది కొంత వరకు నిజమే – మగాళ్లంతా చెడ్డవాళ్లని ఎలా అంటాం' – స్వతహాగా ....., భార్యని అర్థాంగిని గౌరవించేవారు లేరనను – కాని మొత్తం మీద ఆశాతం చాలా తక్కువ. దానికి కారణం. భార్య పూర్తిగా అన్ని, టికి భర్త మీద ఆధారపడాల్సిరావడం – పూజు కొద్ది పురుషుడన్న మాట నిజం బాబూ – నా ఆదృష్టం యింతే – 'నిట్టూర్చి...' అందుకే కాస్తయినా మీనాన్నకి నా విలువ తెల్సివచ్చిందో లేదో తెల్సుకోవాలని కుతూహలంగా వుంది–' అందినవ్వి – రేపు ఆదివారం ఫోను చేస్తాగా – అపుడు నీవే అడుగు బుద్ధి వచ్చిందా' అని హాస్యంగా అన్నాడు నరేష్ –

★ ★ ★ ★ ★

మర్నాడు ఫోను వరాలు తీసింది–' అయ్యాగారు స్నానం చేస్తున్నారండయ్యా

అంటూ గబగబ ఆరాటంగా 'అబ్బాయిగారు వంటావిడ వెళ్ళిపోయిందదండి, అయ్యగారుహోటల్నించి తెచ్చుకుని తింటున్నారు.. ఆరికి ఆతిండి పడటంలేదండి – రెండురోజుల్నించి యిరోచినాలు .. అమ్మగారి కీయండి బాబూ ఫోను – 'అంది ఆయన స్నానం చేసి వచ్చేలోగా మాట్లాడేయాలన్న ఆరాటంతో – ఫోను రాజేశ్వరికందించాడు నరేష్. అమ్మగారూ వంటావిడ వెళ్లిపోయారండి – 'ఎందుకే' 'ఎందుకేటమ్మా, సాధిస్తే, తిడితే – ఏదిచేసినా వంకలు పెడ్తే ఎవరూరుకుంటారమ్మా – మీరేటి పడడానకి. మీ రెళ్లాక అయ్యకోపం మరీ ఎక్కువైందమ్మ. నన్ను తెగ సాధిస్తున్నారమ్మా. వచ్చేయండి బేగా. వరాలు చెప్తుండగానే 'వరాలు' అన్న విశ్వనాథంగారి కేక – ' ఎవరితో మాట్లాడుతున్నావు – పెట్టేయి ఫోను – నిన్నీ విషయాలు ఎవరు చెప్పమన్నారు – ఊ.. పెట్టు..' హుంకరింపువినపడింది ఫోనులో. ఫోను కట్ అయింది. రాజేశ్వరి నిట్టూర్చింది. కొడుకు ఫోను చేసినా ఊ.. ఆ.. అంటూ పొడి మాటలు, బాగున్నను. నాకేం – ' అంటూ ముక్త సరిగా మాట్లాడే వారాయన. వంటావిడ వెళ్లిపోయిందని విని కలవరపడింది రాజేశ్వరి. 'అయ్యో భోజనానికి ఏం చేస్తున్నారో' అంది దిగులుగా. 'ఏం, వూర్లో హోటళ్లు చాలానే వున్నాయి తింటారు వూరికే నీవు బాధపడకు, కాస్తన్నా ఆయనకి నీవిలువ తెల్సివస్తుందిక' అన్నాడు తేలిగ్గా నరేష్ – అంత తేలిగ్గా అనుకోలేకపోయింది రాజేశ్వరి –

వుళ్ళీ ఆదివారం నరేష్ ఫోనుచేస్తే యింట్లో ఫోనెత్త లేదు ఎవరూ ఆరోజంతా నాలుగైదు సార్లు ఫోను చేసినా రెస్పాన్స్ లేదు. – ఊ ఏమయ్యారు నాన్న. ఎక్కడికి వెళ్ళివుంటారు..' స్వగంతలా అన్నాడు – రాజేశ్వరి కాస్త గాభరాపడింది–' నానీ పక్కింటి శంకర్రావుగార్కి కాస్త ఫోను చేసి చూడు ఆయన కేమన్నా తెనుసేమో, కాదంటే నాన్నమేనత్త కొడుకు రంగావున్నాడు అక్కడికి చేసి చూడు – వుండు, నాడైరిలో నంబర్లున్నాయి యిస్తాను – ' ఆందావిడ – పక్కింటి శంకర్రావు 'యిల్లు తాళం వేసివుంది వారంరోజులుగా', నాకేం చెప్పలేదాయన అన్నాడు. రంగా 'అంకుల్ ఆమధ్య ఓసారి మా యింటికి వచ్చారు – వంటమనిషి వెళ్ళిపోయింది యింకెవరినన్నాచూడమన్నారు చూసి పంపిస్తానన్నా – యింకా ఎవరూ దొరకలేదు–దొరికితే తీసుకు వెద్దామను కున్నా, .. నాకే తెలీదే' అన్నాడు. నరేష్ ఆలోచనలో పడ్డాడు. రాజేశ్వరి ఆందోళనతో 'ఏమయ్యారీయన–' అంది దిగులుగా . వుండు ''ఇందు కేమన్నా ఫోను చేసారేమో అడుగుతాను' అంటూ డెట్రాయిట్‌లో వున్న చెల్లెలికి ఫోనుచేశాడు – జరిగింది చెప్పాడు–' ఏమిటో అన్నయ్యా, అమ్మ చేసిన పని బాగులేదు. ఈ వయస్సులో ఆయన్నలా వంటరిగా

వదిలి రావడం - అరవై ఏళ్లు భరించిన ఆవిడ యీ ఆఖరురోజుల్లో ఆయనలో మార్పు వస్తుందనుకుందా - నాన్నగారేం నాకు ఫోను చెయ్యలేదు.' అంటూ వాపోయింది బాధగా.. ''నానీ, ఏమిటిరా నాకు గాభరాగా వుంది - ఈ పెద్దమనిషియేమయ్యారో ఏమిటో, టిక్కట్టు కొనేయ్‌నాకు వెళ్లిపోతా, ఏదన్నా కానిది జరిగితే లోకం నింద వేస్తుంది నామీదే. 'అంది అపరాధ భావంతో - కొడుక్కి ఏమనాలా తోచక తలఊపాడు.

* * * * *

ఆదివారం - ఉదయం పదిగంటల వేళ సావకాశంగా అంతా డైనింగ్ టేబిలు దగ్గర దోశలు తింటుండగా కారుచప్పుడు, ఆవెనక ఇందుమతి గొంతు విని కిటికీలోంచి తొంగి చూసిన వినోదిని ఆశ్చర్యంగా 'మామయ్యగారు. మామయ్యగారొచ్చారు...' అంటూ వీధి గుమ్మం తలుపు తీయడానికి గబగబ వెళ్ళింది. తల్లి కొడుకులు అర్థంకానట్టు మొహాలు చూసుకుంటాండగానే ముందు ఇందుమతి వెనకాతల నెమ్మదిగా విశ్వనాథం గారు లోపలికొచ్చారు - 'నాన్నగారిని తీసుకొచ్చాను అమ్మా - ' నవ్వుతూ అంది ఇందుమతి తల్లి దగ్గిరకెళ్ళి 'ఎప్పుడొచ్చారు - చెప్పలేదు నిన్న .. తెల్సుండీ నటించావా-' నరేష్. చెల్లితో మందలింపుగా అన్నాడు - 'మేమిక్కడ గాభరా పడ్తుంటే ఏం తెలీనట్టు మాట్లాడవా - ఏమిటినాన్నగారూ ఇది. చెప్పచెయ్యకుండా అలా యిల్లు తాళం పెట్టి వెడితే మేంగాభరా పడుతున్నాం 'ముందుగాఫోను చేసి వస్తున్నట్టు చెప్పచ్చుగా -' నాకూతురు, నాకొడుకుని మనవలని చూడలనిపించింది వచ్చాను ముందు పర్మిషన్ తీసుకోవాలారావడానికి-' బుకా యింపుగా అన్నారాయన. 'నాన్నవస్తానని వీసా కాగితాలు పంపమని, ఎవరికి చెప్పొద్దని ప్రామిస్ చెయించుకున్నరు అప్పడే వచ్చి ఐదురోజులయింది - నిన్న నీ ఫోను వచ్చాక యింక సస్పెన్సు వద్దని నేనే చెప్పితీసుకొచ్చాను. 'చూశావా అమ్మా, నాన్నకి నీవంటె ఎంత ప్రేమో నీవు లేకుండా వుండలేక నీ వెనకే పరిగెత్తివచ్చారు - విశ్వనాథం గారి మొహం సిగ్గుతో ఎర్రబడి 'అదేం కాదు - అదేంకాదు - ఏం అవిడేనా నన్ను వదిలి అమెరికా వెళ్లగలదు. నాయిష్టం నేనూ రాగలను - మీ అందరిని చూడాలని వచ్చాను అంతే, తగ్గిపోను సుమా అన్నట్టు బెట్టుగా అన్నారాయన-' అబ్బ నాన్న ...ఒక్క చిన్నమాట నీవులేకుండా వుండలేక వచ్చేసాను అంటే అమ్మ సంతోషిస్తుందిగదా. మీ మగళ్లకింత ఇగో ప్రాబ్లమ్ వుండకూడదు-' కుతురు నవ్వుతూ అంటించింది. 'ఆ, 'ఇగో' ఏ తల్లీ భార్య భర్తల మధ్య దూరాలని పెంచేది - అది మగాళ్లకి అర్థం

కాదు. పెళ్ళాంముందు తలవంచ కూడదనుకుంటాడు మగాడు – తలవంచడం తలవంపులనుకునే భావన వల్ల జీవితంలో ఏం కోల్పోయాడో అర్థం కాదు మగాడికి'– రాజేశ్వరి నవ్వుతూ అంటించింది. భార్యవంక గుర్రుగా చూసి. నేనెప్పటికీ తలవంచని వీరుడినే అది తెలుసుకోండి' గర్వంగా తలెగరేసి 'చాలా గొప్పగా అన్నారు పెళ్ళాం ముందు తగ్గిపోవడం యిష్టంలేక –

''హు..భార్య భర్తలు ఒకరి ముందు ఒకరు అవసరం అయినప్పుడు తలదించుతేనే ఆ సంసారంలో సామరస్యం వుంటుందని చెప్పడానికే మన పెళ్ళిలో జీలకర్రబెల్లం తంతు ఒకరిముందు ఒకరు తలదించి ఒకరి తల ఒకరి చేతులో వుంచి తల వంచి జీలకర్ర బెల్లంలా కల్సిపోవాలని పెట్టిస్తారు. దానిలో పరమార్థ అదే అనేది అర్థం చేసుకుంటే తెలివైన మగాడు భార్యముందు అవసరం అయినపుడు లొంగి పోవడంలో సుఖం ఆనందం వుందనిగుర్తిస్తాడు. సప్తపదిలో భార్యకాలివేళ్ళ పట్టుకుని మట్టెలు తొడిగించడంలోని పరమార్థం అదే – సంసారంలో అన్యోన్యత వుండాలంటే అవసరమైనపుడు భార్య కాళ్ళు పట్టుకోడానికి పురుషుడు సిగ్గు పడాల్సిన అవసరం లేదు అని చెప్పడానకే పబ్లిక్‌గా అందరి ముందు కాలికి మట్టెలు తొడిగిస్తారనిపిస్తుంది. 'అబ్బో, మీ అమ్మకి పడమటి గాలి బాగా వంటపట్టినట్టుంది నెలరోజులకే మాటలు జోరుగా వస్తున్నాయి నోట్లోంచి...' పెళ్ళిళ్ళ గురించి రీసెర్చిచేసినట్టు మాట్లాడు తూంది' హేళనగా, వ్యంగ్యంగా అన్నారు విశ్వనాధం. 'అవును, ఇన్నాళ్ళు నోరిప్పకపోవడమే నే చేసిన తప్పని యిక్కడకీసారి వచ్చాకే బాగా అర్థం అయింది. ఆడది నోరిప్పితే తిరుగు బాటు ధోరణిలాగే కనిపిస్తుంది యిలాంటి మగాళ్ళకి–' రాజేశ్వరీ నవ్వుతూనే అంటించింది.

'డాడీ వాటెవర్‌యుసే.. అమ్మ చెప్పింది కరక్టని మీరు వప్పుకుని తీరాలి. యిప్పటికైనా.. బెటర్ లేట్ దెన్ నెవర్...'' అన్నాడు కొడుకు నవ్వుతూ...

'అన్నయ్యా.. నాన్న గారిలా అమ్మని వదలలేక వెనకాల వచ్చారంటేనే అర్థం కావడంలేదా. నాన్న అమ్మలేకుండా వుండలేరని–' ఇందుమతి నవుతూ హాస్యం ఆడింది. విశ్వనాథం గారి మొహం సిగ్గువల్ల, అవమానం వల్ల ఎర్రబడింది – పంతంగా తల అడ్డ తిప్పుతూ.. పెదాల బిగపట్టి' ఐవిల్ నెవర్ సరెండర్.. అది తెల్సుకోండి. వూరికే మార్పుకోసం. మిమ్మల్ని చూడాలని వచ్చానంతే–' అంటూ గదిలోకి నడిచారు.

ఆయన మొహం చూస్తూ రాజేశ్వరి నవ్వుకుని 'ఏడిశారులెండి మొహంలో కళ్ళు, పళ్ళు వెళ్ళకు వచ్చాయి నెలరోజులకే. బుకాయించకండి' అని చెవిమెలేసి

అనాలనిపించింది. చిన్నప్పుడు కొడుకు అలిగి అన్నంతినకుండా పెదాలు బిగపెట్టి ముద్దపెడ్తుంటే నోరు తెరవకుండా అలిగినపుడు 'పిచ్చివెధవాయమ్మా, అమ్మ మీద కోపం వస్తే అన్నం మీద చూపిస్తారా - అంటూసుతారంగా నెత్తిన జెల్లవేసినట్టు వేయాలనిపించింది అక్షణాన-ఆవిడలోని తల్లిమనసుకి - కాని అంత సామరస్యం - సరసం వుంటే యింక కావల్సిందేముంది అనిపించింది.

(ఆంధ్రభూమి - జనవరి 2005)